# బ్రెస్ట్ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించాలి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: బ్రెస్ట్ క్యాన్సర్‌ను ప్రాధమిక దశలో గుర్తించడం ద్వారా పరిస్థితి చేయిదాటకుండా జాగ్రత్తపడే ఆస్కారం ఉంటుందని ఆఫీసర్ ఆఫ్ ది మోస్ట్ ఎక్స్‌లెంట్ ఆర్డర్ ఆఫ్ బ్రిటిష్ ఎంపైర్(ఓబీఈ) పద్మశ్రీ డాక్టర్ పి. రఘురాం అన్నారు. జేఎన్‌టీయూ, గ్లోబల్ లీడర్‌షిప్ ఔట్‌రీచ్ వెల్‌బీయింగ్(గ్లో) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీ గోల్డెన్ జూబ్లీ హాల్‌లో జరిగిన బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన కార్యశాలలో ఆయన మాట్లాడారు. 40ఏళ్లు దాటిన ప్రతి మహిళ తప్పనిసరిగా మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలన్నారు. కుటుంబసభ్యులు కూడా వారిని ప్రోత్సహించాలన్నారు. బ్రెస్ట్ హెల్త్‌కు సంబంధించిన మొబైల్ యాప్ గురించి వివరించారు. ఈ యాప్‌లో 11 భారతీయ భాషల్లో బ్రెస్ట్ ఆరోగ్యానికి సంబంధించిన ముఖ్యమైన సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. మామోగ్రామ్‌పై అపోహలు తొలగించుకోవాలని, ఇందుకోసం పనిచేస్తున్న సంస్థలు అవగాహన మరింత పెంచాలని పేర్కొన్నారు. జేఎన్‌టీయూ రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి, గ్లో సంస్థ ప్రతినిధి డాక్టర్ ఎ. మేఘనరెడ్డి, జేఎన్‌టీయూ ఎస్సీ, ఎస్టీ సెల్ సమన్వయకర్త డాక్టర్ టి.మాధవికుమారి పాల్గొన్నారు.



కార్యక్రమంలో రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ రఘురాం, మాధవికుమారి, మేఘనరెడ్డి

# బ్రెస్ట్ క్యాన్సర్ పై అవగాహన వర్క్ షాప్

**నవతెలంగాణ-కేపీహెచ్‌బీ**

క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించడం ప్రాణాలను కాపాడుతుందని జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ రెక్టర్ డాక్టర్ కె.విజయకుమార్ రెడ్డి అన్నారు. జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ సహకారంతో బుధవారం బ్రెస్ట్ క్యాన్సర్ పై జేఎన్‌టీయూహెచ్ అడ్మిషన్ బిల్డింగ్‌లోని గోల్డెన్ జూబ్లీ హాల్లో అవగాహన వర్క్ షాప్ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్లోబల్ లీడర్‌షిప్ అవుట్‌రీచ్ అండ్ వెల్‌బీయింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయనతో పాటు డాక్టర్ పి.రఘురామ్, డాక్టర్ టి.మాధవి కుమారి, రాయ్ నేషనల్ అవార్డు గ్రహీత, బ్రెస్ట్ డిసీజ్ సెంటర్ వ్యవస్థాపక డైరెక్టర్ కిమ్స్, బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ అధినేత - ఉషాలక్ష్మిలు లాంఛనంగా ప్రారంభించారు. ఈ వర్క్షాప్‌కు జేఎన్టీయూహెచ్ ఎస్సీ, ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ టి.మాధవి కుమారి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా రెక్టర్ డాక్టర్ కె. విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా అధిక తీవ్రత కలిగిన చికిత్స అవసరం లేకుండా చేస్తుందన్నారు. కుటుంబ సహకారం ఎంతో ముఖ్యమని, తల్లి, భార్య అక్కచెల్లెమ్మల ఆరోగ్యం కోసం పురుషులు బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్‌ను ప్రోత్సహించాలన్నారు. డాక్టర్ రఘు రామ్ మాట్లాడుతూ అవగాహన చాలా కీలకమని, మ్యామోగ్రఫీపై అపోహలు తొలగించేందుకు సరైన అవగాహన అవసరమన్నారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళ సంవత్సరానికి ఒకసారి స్క్రీనింగ్ మ్యామోగ్రామ్ చేయించుకోవాలి అని సూచించారు. అంతేకాకుండా, "ఎటీసీఎస్ ఆప్ బ్రెస్ట్ క్యాన్సర్ లేదా బ్రెస్ట్ హెల్త్ మొబైల్ యాప్ గురించి ఆయన పరిచయం చేశారు. ఈ యాప్ 11 భారతీయ భాషల్లో బ్రెస్ట్ హెల్త్ సంబంధిత ముఖ్యమైన సమాచారం అందిస్తుందన్నారు. ఈ వర్క్‌షాప్‌కు విద్యార్థులు, అధ్యాపకులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు పెద్ద ఎత్తున హాజరై బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన, నివారణపై తమ భాగస్వామ్యాన్ని ప్రకటించారు.

